శుక్రవారం భారత జాగృతి ఆధ్వర్యంలో మాసాబ్ ట్యాంక్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో రమణ, పలు సంఘాల నేతలు

అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలి

ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం స్పందించాలి

- లేకుంటే గ్రామస్థాయి నుంచి ఉద్యమం నిర్మిస్తాం
- ధర్నాలు, రౌండ్ టేబుల్ భేటీలు నిర్వహిస్తాం
- ఈ డిమాండ్‌కు ప్రజాప్రతినిధులు మద్దతునివ్వాలి
- అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి లేఖ రాయాలి
- భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహం వెంటనే ఏర్పాటు చేయాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం గ్రామస్థాయి నుంచి ఉద్యమం నిర్వహిస్తామని, మహాధర్నా చేపడతామని వెల్లడించారు. ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో శుక్రవారం భారత జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ భారత జాగృతి ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం పోరాడి సాధించామని గుర్తుచేశారు. బడుగుల కోసం పనిచేసిన ఆశాజ్యోతి, గొప్ప సంఘ సంస్కర్త పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాల్సిన అవసరముందని అన్నారు. దీనిపై ఇప్పటికే స్పీకర్‌కు వినతిపత్రం అందించామని, తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల మద్దతు కూడగడుతున్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ల కోసం ఉద్యమించి సాధించామని, ఆ రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు. ఆ పరంపర కొనసాగింపుగా ఏ ప్రభుత్వం వచ్చినా బీసీల కోసం పనిచేయాలని ఒత్తిడి చేస్తామని, అందులో తొలి అడుగుగా విగ్రహ సాధన కార్యక్రమాన్ని తీసుకున్నామని వివరించారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటుకోసం తాము చేస్తున్న పోరాటానికి మద్దతుగా అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి లేఖలు రాయాలని విజ్ఞప్తి చేశారు. విగ్రహ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ప్రతి జిల్లాలో, యూనివర్సిటీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఇందిరాపార్క్ వేదికగా మహాధర్నా నిర్వహిస్తామని, ఆ తేదీలను త్వరలో ప్రకటిస్తామని, ప్రతి గ్రామం నుంచి 10-15 పోస్టు కార్డులు పంపించడం వంటి సూచనలు వచ్చాయని, వాటిపై కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. ఏప్రిల్ 11లోపు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చేలా చేస్తామని వివరించారు.

రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానాలు..

ఈ రౌండ్ టేబుల్ సమావేశం 9 తీర్మానాలను ఆమోదించింది. పూలే విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం ఏప్రిల్ 11లోగా సానుకూల నిర్ణయం తీసుకోవాలి, పూలేకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలి, పూలే దంపతుల జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి, బీసీ సంక్షేమశాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి, ఓబీసీ జనగణన చేపట్టాలి, మహిళా బిల్లులో ఓబీసీ కోటాను ఏర్పాటు చేయాలి, కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి అని డిమాండ్ చేస్తూ తీర్మానాలు ఆమోదించింది.

రౌండ్‌టేబుల్ సమావేశానికి విశేష స్పందన..

భారత జాగృతి ఆధ్వర్యంలో రమణ అధ్యక్షతన కొనసాగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి విశేష స్పందన లభించింది. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు, రచయితలు, ప్రొఫెసర్లు కవితకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పద్మశాలి సంఘం నాయకుడు శివశంకర్, ప్రొఫెసర్ తాటికొండ రాజయ్య, ఓయూ జేఏసీ నేత రాజారాం యాదవ్, సంచార జాతుల సంఘం ప్రొఫెసర్ కోలా శ్రీనివాస్, సీపీఐ నేత బాలమల్లేశ్, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, ఓబీసీ కులగణన జేఏసీ చైర్మన్ గోసుల శ్రీనివాస్‌యాదవ్, తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం నేత రాచమల్ల బాలకృష్ణ, వడ్డెర సంఘం నాయకులు మురళి, సీపీఐ(ఎంఎల్) నాయకుడు సుభాష్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు బండారి శేఖర్, బీఎస్పీ నాయకురాలు అనితారెడ్డి, ఓబీసీ అధ్యయన కన్వీనర్ ఎర్రోజు శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘాల చైర్మన్ ఏల్చల దత్తాత్రేయ, రజక సంఘం అధ్యక్షుడు భిక్షపతి, సీపీఐ ఎంఎల్ రెడ్ ఫ్లాగ్ నాయకుడు రాజేశ్, బీసీ సంఘం నాయకులు ఓరుగంటి వెంకటేశ్, బాలమణి, మున్నూరు కాపు సంఘం నాయకుడు మహేందర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు, గంగపుత్ర సంఘం అధ్యక్షురాలు రేణుక, గౌడ సంఘం ఉపాధ్యక్షురాలు కీర్తి లతాగౌడ్, టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు, అఖిల భారత సగర మహా సంఘం అధ్యక్షుడు విజయేంద్ర సాగర్, నాయీబ్రాహ్మణ సంఘం నేత దేవరకొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఆదర్శవంతమైన వ్యక్తి పూలే

బీసీలు, దళితులకే కాకుండా అన్నివర్గాలకు మహాత్మా జ్యోతి రావు పూలే ఆదర్శవంతమైన వ్యక్తి అని బీఆర్ఎస్ నేత, తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ కొనియాడారు. ఆ మహనీయుని విగ్రహం అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేస్తే భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. పూలే విగ్రహ సాధన ఉద్యమం బీసీల ఐక్యతకు పునాదికావాలని ఆకాంక్షించారు. భారత జాగృతి చేస్తున్న ఈ పోరాటంలో అందరూ కలిసి రావాలని, అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు ఎజెండాలు పక్కనబెట్టి విగ్రహం సాధనకు పనిచేయాలని బీఆర్ఎస్ నాయకుడు గట్టు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. వివక్ష లేని సమాజాన్ని బీఆర్ఎస్ కోరుకుందని, కేసీఆర్ నేతృత్వంలో పదేళ్ల పాలనే నిదర్శనమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత ఆంజనేయగౌడ్ కొనియాడారు. పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్ఠించకపోతే కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 50 శాతం బీసీలకు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని, అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ డిమాండ్ చేశారు. రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతీ విశ్వవిద్యాలయాల్లో పూలే పేరిట ఓబీసీ స్టడీ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): టీఎస్‌పీఎస్సీ నూతన చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయాన్నే కార్యాలయానికి చేరుకున్న ఆయనకు సంస్థ సెక్రటరీ అనితా రామచంద్రన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సభ్యులుగా పాల్వాయి రజినీకుమారి, అనితా రాజేంద్ర, ప్రొఫెసర్ ఎన్ యాదయ్య చేత చైర్మన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహించిన 75వ గణతంత్ర వేడుకల్లో పాల్గొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సభ్యులుగా ఎన్నికైన ఎన్ రామ్మోహన్‌రావు, అమీరుల్లాఖాన్ ఇంకా బాధ్యతలు తీసుకోలేదు.

సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించాలి : ఎంబీసీ

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పంచాయతీల పాలన అధికారులకు అప్పగించకుండా, ప్రస్తుత సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించి కొనసాగించాలని ప్రభుత్వానికి ఎంబీసీ సంఘాల జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సర్పంచ్‌ల పదవీకాలం ఫిబ్రవరి రెండో వారంలో ముగియనున్నదని తెలిపారు. కులగణన చేపట్టి, బీసీల రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతామని ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారులకు అప్పగిస్తే పంచాయతీల పాలన గాడితప్పుతుందని అభిప్రాయపడ్డారు.

కాలేజీల కాణాచి

మొదటిపేజీ తరువాయి...

కేంద్ర విద్యా శాఖ గురువారం విడుదల చేసిన ఆలిండియా సర్వే ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్-ఏఐఎస్‌హెచ్‌ఈ(2021-22)నివేదిక వెల్లడించింది. రాష్ట్రాల వారీగా దేశంలోనే దాదాపు 24 కోట్లతో అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో అధిక సంఖ్యలో 8,375 కాలేజీలు ఉన్నాయని, యూపీ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, కర్ణాటక ఉన్నాయని తెలిపింది.

గుజరాత్ కంటే మనమే ముందు

యూపీలో ఎక్కువ కాలేజీలు ఉన్నప్పటికీ ఆ రాష్ట్ర జనాభాను బట్టి చూస్తే, ప్రతి పది లక్షల మందికి కేవలం 30 కళాశాలలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో ప్రతి పది లక్షల మందికి కేవలం 29 కాలేజీలే అందుబాటులో ఉన్నాయి. ఇదే సమయంలో 4 కోట్లు మాత్రమే జనాభా ఉన్న తెలంగాణలో 2,083 కాలేజీలు ఉన్నాయి. అంటే ప్రతీ పది లక్షల మందికి 52 కాలేజీలు అందుబాటులో ఉన్నట్టు లెక్క. ఇక, టాప్-10 రాష్ట్రాల్లో ప్రతి 10 లక్షల మంది జనాభాకు కనీసంగా 30 లేదా అంతకంటే ఎక్కువ కాలేజీలు ఉన్నట్టు నివేదిక తెలిపింది. కాగా ఏఐఎస్‌హెచ్‌ఈ కింద 328 యూనివర్సిటీలకు చెందిన 45,473 కాలేజీలు రిజిస్టరై ఉన్నాయి.

ప్రతి పది లక్షల జనాభాకు కాలేజీలు

రాష్ట్రం	కాలేజీల సంఖ్య
కర్ణాటక	66
తెలంగాణ	52
ఆంధ్రప్రదేశ్	49
హిమాచల్‌ప్రదేశ్	47
పుదుచ్చేరి	53
కేరళ	46

అధిక కాలేజీలు ఉన్న టాప్-10 రాష్ట్రాలు

రాష్ట్రం (జనాభా)	కాలేజీల సంఖ్య
యూపీ (24 కోట్లు)	8,375
మహారాష్ట్ర (11 కోట్లు)	4,692
కర్ణాటక (6.4 కోట్లు)	4,430
రాజస్థాన్ (8.3 కోట్లు)	3,934
తమిళనాడు (8.3 కోట్లు)	2,829
మధ్యప్రదేశ్ (8.8 కోట్లు)	2,702
ఆంధ్రప్రదేశ్ (9.4 కోట్లు)	2,602
గుజరాత్ (7.2 కోట్లు)	2,395
తెలంగాణ(4 కోట్లు)	2,083
పశ్చిమబెంగాల్ (10.2 కోట్లు)	1,514

జిల్లాల వారీగా కాలేజీలు

జిల్లా	కాలేజీల సంఖ్య
బెంగళూరు అర్బన్	1,106
జైపూర్	703
హైదరాబాద్	491
పుణె	475
ప్రయాగ్‌రాజ్	398
రంగారెడ్డి	349
భోపాల్	344
ఘాజీపూర్	333
సికర్	330
నాగ్‌పూర్	326

కోర్సుల వారీగా కాలేజీలు

సాధారణ కాలేజీలు	60%
ఉపాధ్యాయ విద్య	8.7%
ఇంజినీరింగ్	6.1
నర్సింగ్	4.3
మెడికల్	3.5
ఆర్ట్స్ కోర్సు	2.7
ఫార్మసీ	2.4
సైన్స్	0.7
సంస్కృతం	1.4

పీజీ కోర్సు ఆఫర్ చేస్తున్న కాలేజీలు	14,197
పీహెచ్‌డీ ఉన్న కాలేజీలు	1,063

ఘనంగా సైదన్న ఉర్సు గంధోత్సవం

పాలకవీడు, జనవరి 26 (నమస్తే తెలంగాణ): మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న జాన్‌పహాడ్ దర్గా ఉర్సులో రెండో రోజైన శుక్రవారం గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ వక్ఫ్ బోర్డు నుంచి తీసుకొచ్చిన గంధాన్ని చందల్‌ఖానాలో గల గంధంతో కలిపారు. అనంతరం పకీర్ల ఖవ్వాలీ, మేళతాళాల మధ్య మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గంధం ఎత్తుకొని ఊరేగింపును ప్రారంభించారు. దర్గా ముజావర్ సయ్యద్ జానీ ఇంటి నుంచి గుర్రాలపై గంధాన్ని జాన్‌పహాడ్ గ్రామంలో ఊరేగించారు. గంధాన్ని తాకేందుకు భక్తులు పోటీ పడ్డారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సైదులు బాబా దర్శనం కోసం బారులుదీరారు.

జాన్‌పహాడ్‌లో సైదన్న ఉర్సు గంధోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీల హవా

- రాష్ట్రంలో భారీగా పెరిగిన జీఈఆర్
- ఐదేండ్లలో ఆరు శాతం పెరుగుదల
- 2017-18లో 34%, 2021-22లో 40%
- అన్ని క్యాటగిరీల్లో తెలంగాణే బెటర్
- రాష్ట్రాల్లో తెలంగాణకు ఐదో స్థానం
- అయిషే 2021-22 నివేదిక వెల్లడి

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల సంఖ్య రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్నది. మరీ ముఖ్యంగా అమ్మాయిలు, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల ఎన్‌రోల్‌మెంట్ గణనీయంగా మెరుగవుతున్నది. ఇదే విషయాన్ని ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (అయిషే) సర్వే వెల్లడించింది. 2017-18 నుంచి 2021-22 మధ్య ఐదేండ్ల కాలంలో రాష్ట్రంలో మొత్తం నమోదు 6 శాతం పెరిగింది. ఇదివరకు 34 శాతం ఉండగా, ఐదేండ్లల్లో 40.0శాతానికి చేరగా, పురుషుల నమోదు నాలుగు శాతం పెరిగి 34.7శాతం నుంచి 38.5శాతానికి, మహిళల నమోదు ఏకంగా 7 శాతం పెరిగి 34.1 శాతం నుంచి 41.56 శాతానికి చేరింది.

- ఎస్సీల మొత్తం నమోదు శాతం 30.4 శాతం నుంచి 39.2శాతానికి చేరగా, పురుషుల నమోదు 28.6శాతం నుంచి 35.6శాతానికి, మహిళల నమోదు 32.4శాతం నుంచి 42.9శాతానికి అంటే ఏకంగా 10 శాతం పెరిగింది.
- ఎస్టీల నమోదు శాతాన్ని పరిశీలిస్తే మొత్తం నమోదు 28.4% నుంచి 38% చేరగా, పురుషుల నమోదు 30.2% నుంచి 39.1 శాతానికి, మహిళల నమోదు 26.6శాతం నుంచి 36.9 శాతానికి చేరింది.
- జాతీయ సగటు జీఈఆర్ 28.4శాతం, పురుషుల జీఈఆర్ 28.3, మహిళల జీఈఆర్ 28.5శాతం మాత్రమే ఉన్నది. ఎస్సీ, ఎస్టీసహా మహిళల ఏ క్యాటగిరీలో తీసుకున్నా తెలంగాణ జాతీయ సగటు కన్నా ఉత్తమంగా ఉండటం విశేషం.
- రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్యాపరంగా ఉన్నత విద్యలో మొత్తం నమోదు 2017-18లో 14.19 లక్షలు ఉండగా, 2021-22కు వచ్చేసరికి 15.96 లక్షలకు చేరింది. అంటే 1.77 లక్షల నమోదు పెరిగింది. పురుషుల నమోదు 7.35 లక్షల నుంచి 7.93 లక్షలకు పెరిగితే మహిళల నమోదు 6.83 లక్షల నుంచి 8.03 లక్షలకు చేరింది.
- ఎస్సీ విద్యార్థుల నమోదు 2017-18లో మొత్తం నమోదు 2.03 లక్షలుంటే 2021-22లో 2.53 లక్షలకు చేరింది. పురుషుల నమోదు 98 వేల నుంచి 1.19 లక్షలకు చేరితే మహిళల నమోదు 1.05 లక్షల నుంచి 1.34 లక్షలకు చేరింది.
- ఎస్టీల నమోదు 2017-18 నుంచి 2021-22 మధ్యకాలంలో 1.06 లక్షల నుంచి 1.37 లక్షలకు, పురుషుల నమోదు 57 వేల నుంచి 72 వేలకు, మహిళల ఎన్‌రోల్‌మెంట్ 48వేల నుంచి 65వేలకు పెరిగింది.
- ఓబీసీల నమోదు 2017-18 నుంచి 2021-22 మధ్యకాలంలో 5.96 లక్షల నుంచి 7.39 లక్షలకు చేరగా, పురుషుల నమోదు 3.03 లక్షల నుంచి 3.70 లక్షలకు, మహిళల నమోదు 2.92లక్షల నుంచి 3.68 లక్షలకు పెరిగింది.

రాష్ట్రంలో ఉన్నత విద్యలో నమోదు (2021-22 విద్యాసంవత్సరంలో)

విద్యాసంస్థలు	పురుషులు	మహిళలు	మొత్తం
యూనివర్సిటీ, కాన్‌స్టియంట్ కాలేజీలు	1,32,085	1,17,404	2,49,489
కాలేజీలు	6,17,374	6,46,830	12,64,204
స్టాండ్ అలోన్ కాలేజీలు	43,894	39,093	82,987
మొత్తం	7,93,353	8,03,327	15,96,680

రాష్ట్రంలో సామాజికవర్గాలవారీగా నమోదు

సామాజిక వర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
ఎస్సీలు	1,19,137	1,34,691	2,53,828
ఎస్టీలు	72,201	65,372	1,37,573
ఓబీసీలు	3,70,857	3, 68,610	7,39,467
దివ్యాంగులు	2,371	1,618	3,989
ముస్లింలు	64,775	56,543	1,21,318
ఇతర మైనార్టీలు	4,036	5,531	9,567
ఈడబ్ల్యూఎస్	10,800	10,724	21,524

సర్వేలో వెల్లడైన విషయాలు

- కళాశాలల సాంద్రత (కాలేజ్ డెన్సిటీ) పరంగా 18-23 ఏండ్ల మధ్య వయస్సు గల లక్ష జనాభాకు అత్యధిక కాలేజీలున్న రాష్ట్రాల్లో 66 కాలేజీలతో కర్ణాటక మొదటి స్థానంలో ఉన్నది. ఆ తర్వాత 52 కాలేజీలతో తెలంగాణ రెండోస్థానం, 49 కాలేజీలతో ఏపీ మూడోస్థానంలో ఉన్నది. ఈ విషయంలో జాతీయ సగటు కాలేజీల సంఖ్య 30 మాత్రమే.
- ఒక రాష్ట్రంలో అత్యధిక కాలేజీలున్న వాటిలో మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్ టాప్ 5లో నిలువగా, ఆ తర్వాత ఏపీ, గుజరాత్ తర్వాత తెలంగాణ 2,395 కాలేజీలతో 8వ స్థానంలో ఉన్నది.
- ఉన్నత విద్య నమోదులో తెలంగాణసహా పలు రాష్ట్రాల్లో పురుషులను వెనక్కినెట్టి మహిళలు దూసుకుపోతున్నారు. కేరళ, తెలంగాణ, హర్యానా, అసోం, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, మేఘాలయ, చత్తీస్‌గఢ్‌లలో పురుషుల కన్నా.. మహిళల నమోదు అధికంగా ఉన్నది.
- కేంద్రపాలిత ప్రాంతాలను మినహాయిస్తే అత్యధికంగా నమోదుశాతం గల రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగోస్థానంలో ఉన్నది. తమిళనాడు (47), హిమాచల్‌ప్రదేశ్ (43.1), ఉత్తరాఖండ్ (41.8), కేరళ (41.3), తెలంగాణ (40) రాష్ట్రాలు వరుసగా టాప్ 5 రాష్ట్రాల్లో నిలిచాయి.
- ఒక కాలేజీలో సగటు ఎన్‌రోల్‌మెంట్ తెలంగాణలో ఏటా పెరుగుతున్నది. 2017-18లో 558 మంది విద్యార్థులుండగా, 2018-19లో 554, 2019-20లో 545, 2020-21లో 556, 2021-22లో 611 మంది విద్యార్థులకు చేరింది.
- రాష్ట్రంలోని మొత్తం కాలేజీల సంఖ్య సైతం పెరుగుతున్నది. 2017-18లో రాష్ట్రంలో మొత్తం కాలేజీల సంఖ్య 2,045 కాగా, 2018-19లో 1,988, 2019-20లో 2,071, 2020-21లో 2,062, 2021, 22లో 2,083 కాలేజీలకు చేరింది.

ఐదేండ్లలో రాష్ట్రంలో జీఈఆర్ వివరాలు

సంవత్సరం	పురుషులు	మహిళలు	మొత్తం	ఎస్సీ పురుషులు	ఎస్సీ మహిళలు	మొత్తం	ఎస్టీ పురుషులు	ఎస్టీ మహిళలు	మొత్తం
2021-22	38.5	41.6	40.0	35.6	42.9	39.2	39.1	36.9	38.0
2020-21	37.4	40.9	39.1	31.8	39.3	35.4	34.2	33.3	33.7
2019-20	32.2	36.4	34.3	27.6	36.2	31.8	29.7	29.5	29.6
2018-19	33.4	36.5	34.9	28.8	36.4	32.5	30.4	28.7	29.6
2017-18	34.7	34.1	34.4	28.6	32.4	30.4	30.2	26.6	28.4

కాళేశ్వరంపై ఫిర్యాదు అందలేదు

- హైకోర్టుకు నివేదించిన సీబీఐ ఎస్పీ

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి లేదా ఆ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చిన బ్యాంకుల కన్సార్షియం నుంచి తమకు ఫిర్యాదు అందలేదని సీబీఐ స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయన్న అభియోగాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలన్న పిటిషన్‌పై సీబీఐ ఎస్పీ కల్యాణ్ చక్రవర్తి కౌంటర్ దాఖలు చేశారు. కాళేశ్వరం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశమైనందున దర్యాప్తు జరిపే పరిధి సీబీఐకి లేదని, సుప్రీంకోర్టు లేదా హైకోర్టు ఆదేశిస్తేనే ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగలమని వివరించారు. ఒకవేళ కాళేశ్వరంపై తాము దర్యాప్తు చేయాల్సివస్తే మల్టీ డిసిప్లినరీ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కానీ, అందుకు అవసరమైన వనరులు తమ వద్ద లేవని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే కల్పించేలా చూడాలని కోరారు. అందులో భాగంగా ఒక అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, తగిన సిబ్బందితోపాటు ఆఫీసు, వాహనాలను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై హైకోర్టు ఫిబ్రవరి 25న విచారణ జరుపనున్నది.

బీసీలకు 50 శాతం పదవులు ఇవ్వాలి

- ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కార్పొరేషన్లు, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, ఇతర నామినేటెడ్ పదవుల్లో జనాభా ప్రకారం బీసీలకు 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో సమర్థులైన బీసీ నేతలు ఉన్నారని, వారి సేవలకు గుర్తింపును ఇవ్వాలని కోరారు. రాహుల్‌గాంధీ బీసీ లకిచ్చిన హామీలు, ఉదయపూర్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు. ఇటీవల నలుగురు ప్రభుత్వ సలహాదారుల్లో ఒక్కరు కూడా బీసీలు లేకపోవడం సరికాదని పేర్కొన్నారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్ల నిధులను కేటాయించాలని కోరారు.

ఎస్సీఈఆర్టీ వెలవెల

- అధ్యాపకులు, సిబ్బందిలేమీతో ఖాళీ
- 28మంది డిప్యుటేషన్లు, ఓడీలు రద్దు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- మళ్లీ కొత్త డిప్యుటేషన్లపై వస్తేనే కార్యకలాపాలు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యాశాఖలో రాష్ట్ర విద్యాశిక్షణా పరిశోధన మండలి (ఎస్సీఈఆర్టీ) అత్యంత కీలకం. ఇదిప్పుడు అధ్యాపకులు, సిబ్బంది లేమీతో వెలవెలబోతున్నది. ఇంతకాలం డిప్యుటేషన్లు, ఆన్‌డ్యూటీలతో ఎస్సీఆర్టీని నెట్టుకురాగా, తాజాగా వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో గుణాత్మక మార్పులకు దోహదపడే ఈ విభాగం ఖాళీగా దర్శనమిస్తున్నది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఎస్సీఈఆర్టీలో ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్ పై పనిచేస్తున్న 10 మందిపై, ఆన్‌డ్యూటీపై పనిచేస్తున్న మరో 16 మందిపై, డిప్యూటేషనపై పనిచేస్తున్న మరో ఇద్దరిపై ప్రభుత్వం వేటువేసింది. మొత్తం 28 మంది సిబ్బంది డిప్యుటేషన్లు, ఓడీలను రద్దు చేసి, వారి వారి సొంత పోస్టింగ్ స్థానాలకు పంపించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తాజాగా ఉత్తర్వులు జారీచేశారు.

మిగిలిన 15 మందిలోపు సిబ్బంది

ఎస్సీఈఆర్టీలో మొత్తం 10 విభాగాలున్నాయి. ఈ విభాగాల్లో ప్రొఫెసర్, లెక్చరర్, ప్రోగ్రాం ఆఫీసర్ వంటి 20కి పైగా పోస్టులున్నాయి. ఈ పోస్టుల్లో ప్రభుత్వ బీఈడీ కాలేజీలు, డైట్ కాలేజీల్లో విధులు నిర్వర్తించిన సిబ్బందిని ఎస్సీఈఆర్టీలో పనిచేయించుకొనే సంప్రదాయం ఏండ్లుగా కొనసాగుతున్నది. అయితే బీఈడీ, డైట్ కాలేజీల్లోని ప్రొఫెసర్లు, లెక్చరర్లు పదవీ విరమణలు పొందగా, వాటిల్లో పనిచేసేందుకే సిబ్బంది కరువయ్యారు. దీంతో టీచర్లను డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి వారి సేవలను ఎస్సీఈఆర్టీలో వినియోగించుకొంటున్నారు. తాజా డిప్యూటేషన్ల రద్దుతో పదిమంది లోపే సిబ్బంది ఎస్సీఈఆర్టీలో మిగిలారు. ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక లెక్చరర్, ఒక డిప్యూటీ డైరెక్టర్, ఒక సైన్స్ అసిస్ట